క్లుప్తంగా

శ్మశానం.. పరిశుభ్రం


శ్మశానంలో చిల్లచెట్లు తొలగిస్తున్న జేసీబీ

కొనకనమిట్ల: మండలంలోని మంగాపురం గ్రామంలో శ్మశానం పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో అధ్వానంగా తయారైంది. అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు తలెత్తుతుండటంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చెక్కెర శ్రీధరరెడ్డి స్పందించి తన సొంత ఖర్చులతో శ్మశానాన్ని బాగు చేయించారు. శ్మశానంలోని పిచ్చి మొక్కలు, చిల్లచెట్లను జేసీబీతో తొలగింపజేసి, భూమిని చదును చేయించారు. శ్మశానాన్ని బాగు చేయించిన శ్రీధరరెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి


కంభంలో జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంభం: కవి కోకిల గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కంభంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం ఘన నివాళులర్పించారు. సంఘ నాయకుడు పానుగంటి షాలెంరాజు మాట్లాడుతూ.. దళిత కుటుంబంలో జన్మించి, తన సాహిత్యంతో కుల అసమానతలపై గళం విప్పిన మొదటి వ్యక్తి జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో నేదరపల్లి జయరాజ్, ప్రభాకర్, భాస్కర్, నెమలిగుండం తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ రమణారెడ్డి

బేస్తవారిపేట: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని కొత్తపల్లె ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. గణితంపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో వసతులు, రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పుల్లలచెరువు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి తప్పని సరిగా ఎంపీటీసీలు, అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

సాయిబాబ ఆలయంలో పూజలు

పుల్లలచెరువు: మండలంలోని ఉమ్మడివరంలో వేంచేసి ఉన్న సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి శంకర్ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మార్కాపురంపై డ్రోన్లతో నిఘా


ఇంటిని తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో లాఅండ్‌ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగా డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ పి.సుబ్బారావు పేర్కొన్నారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న అనుమానం ఉన్న పలు ప్రాంతాలను గురువారం డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించినట్లు తెలిపారు. తర్లుపాడు రోడ్డు, అల్లూరిపోలేరమ్మ గుడి ఏరియా, ఇందిరమ్మకాలనీ, చెన్నరాయునిపల్లి ప్రాంతాలపై నిఘా ఉంచామన్నారు. కాగా అనుమానాస్పదంగా ఉన్న ఒక ఇంటిని సీఐతోపాటు ఎస్సై రాజమోహన్‌రావు, పోలీస్ సిబ్బంది తనిఖీ చేశారు. పూజకు భక్తుల రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, స్వామివారికి అభిషేకాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పూజా సామగ్రితో ఉదయం 5 గంటల నుంచి జరిగే పూజల్లో పాల్గొనవచ్చని చెప్పారు.


గొట్లగట్టులో బస్ కోసం రోడ్డుపై నిల్చున్న ప్రయాణికులు


చినారికట్ల జంక్షన్‌లో బస్ కోసం ఇలా..

పడిగాపుల ప్రయాణం

బస్సెక్కాలంటే ఎండకు ఎండాలి.. వానకు తడవాలి

- కొనకనమిట్ల మండలంలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు
- బస్సుల కోసం రోడ్లపైనే నిల్చుని ఎదురుచూపులు
- కొనకనమిట్ల, చినారికట్ల జంక్షన్‌లో షెల్టర్లు పునర్నిర్మించాలని డిమాండ్


హైవే నిర్మాణంలో భాగంగా షెల్టర్ తొలగించిన కొనకనమిట్ల బస్టాండ్

కొనకనమిట్ల:

ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సురక్షితమే కానీ ఆ ప్రయాణానికి ముందు ప్రధాన గ్రామాల్లో ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. బస్సుల కోసం వేచి ఉండేందుకు ఎలాంటి వసతులు లేకపోవడంతో రోడ్డు మార్జిన్లలో నిల్చోవాల్సిన దుస్థితి. ఉత్సాహంగా ఊర్లకు బయలుదేరినవారు కూడా బస్టాండ్లకు చేరుకోగానే బావురుమంటున్నారు. నిల్చునీ నిల్చునీ కాళ్లు గుంజుతున్నా, శరీరాన్ని నిస్సత్తువ ఆవరిస్తున్నా బస్సుల కోసం మొండిగా ఎదురుచూడక తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి షెల్టర్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పలు గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు వర్షం వచ్చినా, ఎండ మండుతున్నా రోడ్డుపై నిల్చోక తప్పని పరిస్థితి. గొట్లగట్టు, కొనకనమిట్ల, పెదారికట్ల బస్టాండ్ సెంటర్, చినారికట్ల జంక్షన్, దొనకొండ అడ్డరోడ్డు జంక్షన్, ఎదురాళ్లపాడు సెంటర్లో ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది.

ఉన్నా ఉపయోగం లేదు..

గొట్లగట్టులో బస్ షెల్టర్ ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండాపోయింది. బస్ షెల్టర్‌కు అడ్డుగా ఆటోలు నిలపడం, తోపుడు బండ్లు అడ్డుగా ఉంచడంతో ప్రయాణికులు ఆ ఛాయలకు కూడా వెళ్లడం లేదు. ఒంగోలు, పొదిలి, గిద్దలూరు, మార్కాపురం వైపు వెళ్లే ప్రయాణికులు రోడ్డుపై నిల్చోక తప్పడం లేదు. అధికారులు తక్షణమే స్పందించి బస్ షెల్టర్‌ను వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.


గొట్లగట్టులో బస్ షెల్టర్‌కు అడ్డుగా ఆటోలు, తోపుడు బండ్లు

షెల్టర్ల నిర్మాణం ఎప్పుడు?

ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రం కొనకనమిట్లతోపాటు పెదారికట్ల బస్టాండ్ సెంటర్లలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో కొనకనమిట్ల సెంటర్లో ఉన్న బస్ షెల్టర్, చినారికట్ల జంక్షన్‌లో ఉన్న బస్ షెల్టర్‌ను రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. వాటిని పునర్నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులు దుకాణాల వద్ద, రోడ్డు వెంట నిల్చోవాల్సి వస్తోంది. అలాగే ఎదురాళ్లపాడు, మునగపాడు, దొనకొండ అడ్డరోడ్డు జంక్షన్, మర్రిపాలెం బస్టాండ్ సెంటర్లోనూ ప్రయాణికులు వేచి ఉండేందుకు తగిన వసతి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


బస్ షెల్టర్‌లేని పెదారికట్ల బస్టాండ్

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఏడీఏ మహబూబ్‌బాషా


మార్కాపురంలో మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

గిద్దలూరు రూరల్: లాభాలు తెచ్చిపెట్టి, సమాజానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయంపై రైతులు శ్రద్ధ చూపాలని ఇన్‌చార్జి ఏడీఏ షేక్ మహబూబ్‌బాషా సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, బేస్తవారిపేట మండలాల వ్యవసాయ అధికారులు, ఉద్యానవనశాఖ, పట్టుపరిశ్రమ అధికారులకు గురువారం నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులపై ఉందన్నారు. ప్రకృతి సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ మెర్సీ, గిద్దలూరు ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, బేస్తవారిపేట ఏఓ షేక్ అబ్దుల్ రఫీ, కొమరోలు ఏఓ రాజేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

మార్కాపురం: రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులకు ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. గురువారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో వ్యవసాయాధికారులు, సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రకృతి సాగుతో రైతులకు ఆదాయంతోపాటు ప్రజలకు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఘన, ద్రవ జీవామృతం తయారీపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు శిరీష, రమణారెడ్డి, ఏఓలు బుజ్జిబాయి, లక్ష్మి నారాయణ, జ్యోత్స్న, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో జగదాంబ అమ్మవారికి అమావాస్యను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయ శర్మ జగదాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ చెన్నకేశవ రెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాబాకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెం, కొత్తపాలెం, వెలుగువారిపాలెం సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పూజారులు బాబాను ప్రత్యేకంగా అలంకరించి గణపతి పూజ చేసి హారతులు అందించారు. గురువారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

బురద రోడ్డుపై నరకం


నిర్మలా కాన్వెంట్ దగ్గర రోడ్డు దుస్థితి

పొదిలి: పట్టణ పంచాయతీగా రూపాంతరం చెందిన పొదిలిలో ప్రధాన వీధులు ఎంత దారుణంగా ఉన్నాయో ఈ చిత్రాలు తెలియజేస్తున్నాయి. స్థానికులు విరాట్ నగర్‌గా పిలుచుకునే నిర్మలా కాన్వెంట్ రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. జగనన్న కాలనీ, పిచ్చిరెడ్డితోట, విరాట్‌నగర్, నిర్మలా కాన్వెంట్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రజలు, విద్యార్థులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై బురద పేరుకుపోవడంతో నడిచి వెళ్లేవారు అడుగు తీసి అడుగేసే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా పెరగిన చిల్లచెట్లు జనాన్ని మరింత ఇబ్బందికి గురిచేస్తున్నాయి. పురపాలనాధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


విరాట్ నగర్ సమీపంలో రోడ్డు ఇలా

జ్యోతిష్య సిద్ధాంతి సురేష్‌కు వాస్తు విద్వన్మణి పురస్కారం



సురేష్‌కు పురస్కారాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి డాక్టర్ అమరా సురేష్‌కు బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో పరాశరాస్ అకాడమీ ఆఫ్ ఆస్ట్రో సైన్సెస్ ప్రతినిధులు వాస్తు విద్వన్మణి పురస్కారాన్ని అందజేశారు. జ్యోతిష్య, వాస్తు శాస్త్రం, సనాతన ధర్మం పరిడవిల్లేందుకు సురేష్ చేస్తున్న కృషికి గుర్తింపుగా పరాశరాస్ సంస్థ ప్రతినిధి మహేష్‌చంద్ర భరద్వాజ్ అవార్డు అందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సురేష్‌ను పురప్రముఖులు అభినందించారు.

సీసీ రోడ్డుపై వర్షం నీరు తొలగింపు


రోడ్డుపై నీరు తొలగించడంతో నడిచి వెళ్తున్న విద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్..

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజానగర్ ముందు భాగంలో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షం నీటితో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై 'పుర వీధుల్లో ప్రయాణ సంకటం' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ ఈ.వి.రమణయ్య స్పందించారు. వర్షం నీటిని డ్రెయినేజీలోకి మళ్లించేలా చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా రోడ్డుకు ఒక వైపు కాలువ తవ్వించి నీరు ముందుకు వెళ్లేలా చేయడంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి. రోడ్డుపై నీరు నిల్వలేకుండా త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతాయని కమిషనర్ చెప్పారు.

గ్రంథాలయ పితామహుడు

'అయ్యంకి' ఘన నివాళి


గిద్దలూరులో అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


పొదిలిలో రమణయ్య చిత్రపటానికి నివాళులు..

గిద్దలూరు రూరల్: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 135వ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి మాట్లాడుతూ.. సమాజానికి విజ్ఞాన వెలుగులు పంచేందుకు అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయ ఉద్యమం ద్వారా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు రామిరెడ్డి, విశ్రాంత పంచాయతీ కార్యదర్శి డి.నారాయణరెడ్డి, యువ ప్రగతి సంస్థ నిర్వాహకుడు ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి గ్రంథపాలకుడు శ్యాంసన్‌తోపాటు పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ వ్యవస్థ ఏర్పాటుకు రమణయ్య చేసిన కృషిని కొనియాడారు. గ్రంథాలయాలను సక్రమంగా నిర్వహించడమే వెంకట రమణయ్యకు ఘన నివాళి అని ముఖ్య అతిథి హుస్సేన్ పాషా పేర్కొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి మాత జయంతి

కొనకనమిట్ల: మండలంలోని మునగపాడు గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలను పురస్కరించుకుని గురువారం విశేష పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. నాగేటి సాళ్లలో ఉద్భవించిన అమ్మవారిని గ్రామంలోని తొగటవీర క్షత్రియులు కులదేవతగా ఆరాధిస్తారు. ఈ ప్రాంత ప్రజలు తమ సంతానానికి చౌడయ్య, చౌడమ్మ, చౌడేశ్వరి అనే పేర్లు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పూజల అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి


మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలి

- సీఎండీ పుల్లారెడ్డి


మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి

మార్కాపురం టౌన్: విద్యుత్ బకాయిల వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని విద్యుత్‌శాఖ సీఎండీ పి.పుల్లారెడ్డి ఆదేశించారు. గురువారం మార్కాపురంలోని సౌజన్య ఫంక్షన్ హాలులో మార్కాపురం డివిజన్‌లోని విద్యుత్ శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం డివిజన్‌లో సుమారు 43 కోట్ల రూపాయల విద్యుత్ బకాయిలున్నట్లు తెలిపారు. డివిజన్‌లో 3300 వ్యాపార సర్వీసులు, 856 ప్రభుత్వ సర్వీసులకు స్మార్ట్‌మీటర్ల బిగింపును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 1057 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సర్వీసు అందించాలన్నారు. విద్యుత్ ఫీడర్లు ట్రిప్ అవుతున్నాయని, మరమ్మతులు నిర్వహించి 24/7 సరఫరా అందించాలని ఆదేశించారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు చూసుకోవాలని సూచించారు. అనంతరం మార్కాపురం మండలంలోని ఇడుపూరు గ్రామంలో ఇండోర్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌కు నెలవారీ మరమ్మతులు నిర్వహించాలని తెలిపారు. పీఎం సూర్యఘర్, ఓవర్‌లోడ్‌పై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం నుంచి ఎస్సీ, ఎస్టీల గృహాలకు ఉచితంగా సోలార్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి టెండర్లు పిలవడం జరిగిందని, సెప్టెంబర్ 1 నుంచి ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వర్లు, మార్కాపురం ఈఈ నాగేశ్వరరావు, ఏడీఈ సియానాయక్, డివిజన్‌లోని ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.